క్లుప్తంగా

నేడు లోక్ అదాలత్

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు నందు లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధర్‌రావు తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించే విధంగా పోలీసులు, బార్ అసోసియేషన్ సభ్యులు చూడాలని తెలియజేశారు. అలాగే పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను సామరస్యపూర్వకంగా రాజీచేసుకొని సత్వర న్యాయం పొందాలని విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి

పిడుగురాళ్లరూరల్: అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. మండలంలోని కరాలపాడు గ్రామంలో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సహకారంతో డీఎంఎఫ్‌టీ ఫండ్ నిధులతో రూ.25 లక్షలు సీసీ రోడ్లు, డ్రైనేజి నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, సర్పంచ్ చల్లా శివారెడ్డి, ఎంపీటీసీ అన్నబోతుల గురవారెడ్డి, పీఏసీఎల్ అధ్యక్షులు నంబూరి పుల్లారెడ్డి, పల్నాడు జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి ఇల్లూరి వెంకటరామిరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మద్దసాని రమణారెడ్డి, మాజీ ఏపీసీఎస్ అధ్యక్షులు యాలవర్తి మల్లిఖార్జునరెడ్డి, మాజీ పీఏసీఎల్ అధ్యక్షులు బుర్రి అంబిరెడ్డి, గ్రామ కన్వీనర్ అబ్దుల్లా పాల్గొన్నారు.

పాస్టర్లు ఐకమత్యంగా ఉండాలి

గురజాల : పాస్టర్లు అందరూ ఐకమత్యంగా ఉండాలని నియోజకవర్గ పాస్టర్లు అసోసియేషన్ అధ్యక్షుడు చందాల మరియదాసు అన్నారు. దాచేపల్లిలోని లూథరన్ చర్చిలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి పాస్టర్ల అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందాల మరియదాసు, గౌరవ అధ్యక్షులుగా రెవ.ఆదూరి మానిలావ్, కాటిపల్లి డేవిడ్‌రాజు, దేవసహాయం, బాసిపోగు సాగర్ బాబు, కె.మెహెబ్కెలు, మెంబర్లుగా ఐ.పాల్, జక్కరయ్య నాయక్, వరప్రసాద్, అనిల్‌కుమార్, సుధీర్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన సంఘ సభ్యులను పలువురు అభినందించారు.

శానిటైజర్స్ అందజేత

సత్తెనపల్లి: ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో మిత్రుడు తొమ్మండ్రు రవి సహాయంతో శుక్రవారం రూ.10 వేలు విలువగల శానిటైజర్స్ అందించారు. కార్యక్రమంలో కొత్త రామకృష్ణ, వైద్యురాలు డాక్టర్ సుమిత్ర, ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆలీ, చందు, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

రేపు రెడ్డి వన సమారాధన


సత్తెనపల్లి: కార్తీక మాసం పురస్కరించుకొని పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల అన్నం గురువమ్మ కృష్ణమూర్తి (ఏజీకేఎం) డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 10న రెడ్డి జనసేవా సమితి ఆధ్వర్యంలో రెడ్డి వన సమారాధన జరుగుతుందని రెడ్డి జనసేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, బాలబాలికలకు, మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెడ్డి సోదర సోదరీమణులు కుటుంబ సభ్యులతో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రపంచ దివ్యాంగుల వేడుకలు



ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల ప్రత్యేక అవసరాలుగల విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఒంగోలు రాజు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల చిన్నచూపు ఉండకూడదన్నారు. అన్ని రంగాల్లోను సమాన అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్రైసైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సీతారామిరెడ్డి, ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాల కేంద్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



అచ్చంపేట: స్థానిక తుమ్మెపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రథమ ఉపాధ్యాయులు ముప్పాళ్ల గోపాలకృష్ణమూర్తి శత జయంతి ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారి కుమారుడు ముప్పాళ్ల వెంకటేశ్వర్లు పాఠశాల గ్రంథాలయానికి రూ.20వేలు విలువ చేసే విజ్ఞాన, వినోద, ఆధ్యాత్మిక, సందేశాత్మక పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల గోపాలకృష్ణమూర్తి చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు, శిష్య బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నదాతలు అధైర్యపడవద్దు

- రైతులను ఆదుకునేలా సత్వర చర్యలు
- క్షేత్రస్థాయిలో పంట పొలాల పరిశీలన
- పంట నష్టం అంచనాలు తయారీలో వ్యవసాయ శాఖ

గురజాల : రైతులు ఎవరూ అధైర్యపడవద్దని తహసీల్దార్ మీసాల దానియేలు అన్నారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను శుక్రవారం పరిశీలించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం కారణంగా తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించవచ్చన్నారు. ఎవరూ కూడా అధైర్యపడకుండా ఉండాలన్నారు. ఎన్‌జీ రంగా వ్యవసాయ విద్యాలయం శాస్త్రవేత్త సైదా నాయక్ మాట్లాడుతూ ముందుగా పంట పొలాల్లో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించాలన్నారు. తరువాత ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించడం జరిగిందని ఆ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గురజాల మండలంలో తక్కువ వర్షపాతం నమోదు జరిగిందన్నారు. పంట నష్టం ఏమీ లేదన్నారు. వర్షం కారణంగా నేలపైకి ఒరిగిన వరికంకులను రక్షించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణి తదితరులున్నారు.



తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇస్తున్న రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు

మిరపలో ఫార్ములా-4

మాచవరం: తుఫాన్ కారణంగా మిరప పంట పొలాల్లో వర్షపునీరు నిలిచి, మొక్కలు వడలిపోయే అవకాశం ఉన్నందున రైతులు 19-19-19 లేదా ఫార్ములా-4 పైపాటుగా పిచికారీ చేయాలని ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ఈదురుగాలులకు మిరప మొక్కలు వాలి పోయాయని, ఒరిగిన మొక్కలను నిలదొక్కుకొని సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. మండల వ్యవసాయాధికారిణి కె.రామమ్మ మాట్లాడుతూ వ్యవసాయశాఖ సిబ్బంది ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో అందుబాటులో ఉండి, తుఫాన్‌కు దెబ్బతిన్న పంట పొలాలు సందర్శించి, రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ యు.వరప్రసాద్, మండల వ్యవసాయ మండలి చైర్మన్ చౌదరి సింగరయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మిరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, సభ్యులు గురవయ్య, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ రామమ్మ

నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటాం

రెంటచింతల: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాలువాయి, తుమ్మకోట, పాలువాయిగేటు తదితర గ్రామాలలో తుఫాన్‌కు దెబ్బతిన్న వరి, మిర్చి పొలాలను ఆయన మండల ఏఓ బోయపాటి బ్రహ్మారెడ్డి, వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించి మాట్లాడారు. మూడు రోజులపాటు కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన ప్రతి ఎకరాకు నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతులు ధైర్యంగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి పంటల నష్టం అంచనా వేస్తారన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పొలాలను పరిశీలించి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఏఓ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో భారీ వర్షాల కారణంగా పంట నష్టంపై ప్రాథమిక అంచనా నివేదికలు జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందన్నారు. వరి పంటలకు సస్యరక్షణ చేపట్టాలని ఇప్పటికే అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. వరి, మిర్చిలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. వారి వెంట మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు ములకా ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.



పాలువాయిలో వరిపంటను పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, ఏఓ బ్రహ్మారెడ్డి

మిర్చిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలి

దుర్గి: తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల వల్ల మిర్చి పంటకు పురుగు తెగుళ్లు సోకే అవకాశం ఉందని ఉద్యానవన శాఖ అధికారి ఎస్.సురేష్ అన్నారు. శుక్రవారం ముటుకూరు గ్రామంలోని మిర్చి పంటలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అధిక వర్షాల వలన నీరు నిలబడి తేమ వల్ల మిరప పంటకు తెగుళ్లు, పురుగు ఆశించడమే కాకుండా సూక్ష్మధాతులోపాలు కూడా కనబడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం మిరప పూత కాయ దశలో ఉందని అన్నారు. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని నింపాలని మొక్కలు ఉరికెత్తి తలలు వాలినట్లయితే యూరియా వారం రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వలన ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. వాటి నివారణకు తెగులు మందులు పిచికారీ చేయాలని సూచించారు. వాతావరణం చల్లగా ఉండటం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి కూడా పెరిగే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు.



ముటుకూరులో మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి సురేష్



పిన్నెల్లిలో మిరప పంటను పరిశీలించి సూచనలు, సలహాలిస్తున్న ఉద్యానశాఖ అధికారి వై.మోహన్

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి

మాచవరం: వర్షాల కారణంగా మిరపలో అధిక తేమ వలన మొక్కలకు సరైన పోషకాలు తీసుకోలేవని సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని ఉద్యానశాఖ అధికారి వై.మోహన్ తెలిపారు. మండలంలోని పిన్నెల్లి గ్రామంలో మిరప పంటలను క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి, మొక్కలకు నష్టం వాటిల్లే అవకావం ఉందన్నారు. పంటలకు పురుగు, తెగుళ్ల ఆశించి, సూక్ష్మదాతులోపం ఎక్కువగా ఉంటుందన్నారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలని, వాలిని మొక్కలు నిలదొక్కి చుట్టూ మట్టిని ఎగదోయాలని సూచించారు. ఉరికెత్తి తలలు వాల్చిన ట్లుయితే లీటరు నీటికి 10 గ్రాములు యూరియా కలిపిన ద్రావణాన్ని వారానికి రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. వడలినట్లయితే లీటరు నీటికి 5 గ్రాముల మెగ్నీషియంసల్ఫేట్ ద్రావణాన్ని, ఇనుప ధాతులోపం ఉన్నట్లయితే 10 లీటర్ల నీటికి 50 గ్రాముల అన్నబేధితో పాటు, ఒక నిమ్మ చెక్కరసం కలిపి పిచికారీ చేయాలన్నారు. పైపాటుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 200 కిలోల వేపపిండి వేయాలని తెలియజేశారు. నేల అదునువచ్చిన తర్వాత గొర్రుతో అంతర కృషి చేయాలన్నారు. బాక్టీరియా, ఆకుమచ్చ, కోనొధారా వంటి తెగుళ్ల ఆశించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమానికి రూ.50వేల విరాళం

అందజేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే



దుర్గి: మండల పరిధిలోని మంగాపురం తండా గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంగా దేవాలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. బుడగ జంగాల సంఘీయులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచిందని తెలిపారు. కులధ్రువీకరణ పత్రాల విషయంలో గత తెలుగుదేశం ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని కానీ సీఎం జగన్ వారి సమస్యను పరిష్కరించి బుడగ జంగాల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడ్డారని తెలిపారు. రాబోవు రోజులలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి హామీ ఇచ్చారు. కాగా ప్రతిష్ఠ మహోత్సవం రోజు నిర్వహించే మహాఅన్నదాన క్యాక్రమానికి పీఆర్కే రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ నెల 18న ఉదయం 9గంటలకు ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించుటకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, మల్లయ్య, గెలమయ్య, శ్రీను, పెద్దిరాజు, ఆలయ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని ఇరుకుపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాలెం మండలం గణపవరంకు చెందిన నంబుల పిచ్చయ్య తన ద్విచక్రవాహనంపై భార్య, కుమారుడితో కలిసి గణపవరం వెళుతుండగా దమ్మాలపాడు గ్రామానికి చెందిన యంపరాల కృష్ణ ద్విచక్రవాహనంపై వస్తూ ఇరుకుపాలెం సమీపంలో పిచ్చయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పిచ్చయ్య, కృష్ణకు గాయాలవటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

క్రైస్తవ సోదరుల అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

మాచర్ల : నియోజకవర్గంలో క్రైస్తవ వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు ఉన్న క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం వార్డు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రార్థనా మందిరాలు, ఎస్సీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, తదితర వాటి కోసం రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందన్నారు. 20వ వార్డులో కమ్యూనిటీ హాలు పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. క్రైస్తవ సోదరులకు ఇళ్ల పట్టాలు, అభివృద్ధి పథకాలు చేపట్టడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రైస్తవ సోదరుల కోసం పలు అభివృద్ధి పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్, క్రైస్తవ సంఘ చర్చి పెద్దలు, పెద్ద ఏసోబు, మాచర్ల రూబెన్, కౌన్సిలర్లు మందా సంతోష్, వేల్పుల గురవయ్య, జీవన్, మాచర్ల సుబ్బారావు, పార్టీ నేతలు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాలును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నేతలు

జాతీయ సేవారత్న అవార్డు గ్రహీతకు సన్మానం

రెంటచింతల: పల్నాడు ప్రాంతంలో 30 సంవత్సరాల పాటు దేవుని సేవ చేస్తున్న జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ ఫౌండర్, ప్రెసిడెంట్ రెవ.డాక్టర్ డాకూరి ప్రభుదాస్‌కు 2023 సంవత్సరానికి జాతీయ సేవారత్న అవార్డును ఏపీ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పి.లక్ష్మి శుక్రవారం ప్రదానం చేసి సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ దేవుని వాక్యాన్ని బోధిస్తూ ప్రజలను మంచి మార్గంలో నడిపిస్తూ దేవుని సేవకు అంకితమైన ప్రభుదాస్ పాస్టర్లకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సీ డా.ఎం.అరుణ్ కుమార్, క్రైసవ సాహిత్య అకాడమీ నేషనల్ డైరెక్టర్ డా.ఎం.ప్రభాత్ కుమార్, కార్యదర్శి డా.గంటా విజయకుమార్ పాల్గొన్నారు. అవార్డు గ్రహీత ప్రభుదాస్‌ను పాస్టర్లు, తదితరులు అభినందించారు.



డాకూరి ప్రభుదాస్‌ను సన్మానిస్తున్న ఏపీ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పి.లక్ష్మి తదితరులు

సంక్షేమం, అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

ఎన్నికల మేనిఫెస్టోలోని 98శాతం హామీలు అమలు: ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల రూరల్: ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రమైన భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి 98శాతం హామీలను అమలుపరచి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించుకుందామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కోరారు. శుక్రవారం రాత్రి మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. జగనన్న పాలనతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి బాటలో పయనించాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదేనన్నారు. అబద్ధాల చంద్రబాబు ప్యాకేజి పవన్ కళ్యాణ్‌తో కలిసి కొత్త పొత్తులు, ఎత్తులతో మరోసారి ప్రజల వద్దకు వచ్చే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి నక్కజిత్తుల చంద్రబాబును ప్రజలెవరూ నమ్మరని, మళ్లీ గట్టిగా బుద్ధిచెప్పి అభివృద్ధి, సంక్షేమంతో ఆర్థిక భరోసా ఇస్తున్న జగనన్ననే గెలిపించుకుందామన్నారు. కొత్తపల్లి గ్రామంలో పంచాయతీకి రూ.29.18కోట్లతో సంక్షేమం, అభివృద్ధి అందించామని, అలాగే చెరువును అభివృద్ధి చేసి సాగర్ రోడ్డును డబుల్ రోడ్డుగా తండాలలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూపకల్పనకు శ్రీకారం చుట్టనున్నట్లు చెప్పారు. అనంతరం గడప గడపకు తిరుగుతూ అన్నా, అమ్మా, అవ్వా, పెద్దయ్య అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ అధికారులతో కలిసి జగనన్న పాలనను వివరించారు. సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన మండల పార్టీ సీనియర్ నాయకులు బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు మండ్లి పెద మల్లుస్వామి, మండల ఉపాధ్యక్షులు పోతురెడ్డి సుజాత కోటిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అప్పిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ కొండలు, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, చంద్రారెడ్డి, మల్లయ్య, హనిమిరెడ్డి, లక్ష్మారెడ్డి, మాద్యానాయక్, రంగానాయక్, రవినాయక్, సైదులు, కృష్ణ, వెంకట్రామయ్య, బూషయ్య, బొల్లారెడ్డి, రంగయ్య, మేడబోయిన కోటయ్య తదితరులున్నారు.



కొత్తపల్లిలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న పీఆర్కే, నాయకులు



కొత్తపల్లిలో జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఆర్కే

అభివృద్ధి చరిత్రాత్మకం

- నగర పంచాయతీగా దాచేపల్లి అప్‌గ్రేడ్
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి చరిత్రాత్మకమని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని చాపలగడ్డలో నూతనంగా నిర్మించిన ఏపీజే అబ్దుల్‌కలాం షాదీఖానాను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే కాసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు చేయలేని పనిని తాను చేసి చూపించానని, రూ.10 కోట్లతో కాటేరువాగును చంద్రబాబు ఆధునీకరణ చేస్తానని చెప్పి పది పైసలు కూడా ఇవ్వలేదని, తాను కేవలం రూ.18 లక్షల వ్యయంతో కాటేరువాగును ఆధునీకరించి దాచేపల్లిని వరద ముంపు నుంచి కాపాడానన్నారు. దాచేపల్లికి గుండకాయలాంటి కొట్లాబజార్‌లో రూ.2.50కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ నిర్మించామని, ముత్యాలంపాడు రోడ్డును విస్తరించామని అన్నారు. రూ.3కోట్లతో నడికుడి రైల్వేస్టేషన్ రోడ్డును విస్తరిస్తున్నామని, నగర పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి కృష్ణా జలాలు అందించేందుకు రూ.16కోట్ల నిధులు మంజూరు అయ్యాయని పేర్కొన్నారు. ఇప్పటికే 2వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, త్వరలో మరో 1500 మందికి అందజేస్తున్నామని చెప్పారు. దాచేపల్లిని నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేసి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తాము చేసిన అభివృద్ధి సజీవ సాక్ష్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, గత టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపనలు చేసి కొబ్బరికాయలు కొట్టారే తప్ప అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు.



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పదవులు ఇచ్చి మా పక్కనే కుర్చోబెట్టుకున్నాం:

2019 వరకు నియోజకవర్గంలో ముస్లిం, మైనార్టీలకు ఒక్క పదవి కూడా ఇవ్వలేదని, 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆరుగురు ముస్లిం సోదరులకు పదవులు ఇచ్చి మా పక్కనే కుర్చోబెట్టుకున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ముస్లిం, మైనార్టీలు మా సొంత కుటుంబ సభ్యులని వ్యాఖ్యానించారు. నారాయణపురంలో 2 ఎకరాల్లో ఈద్గా నిర్మాణం చేపట్టామని, రూ.15లక్షల వ్యయంతో కబరస్థాన్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ..అభివృద్ధి, సంక్షేమం చూసి మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని, మరోసారి అవకాశం ప్రజలు ఇస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ సైదా ఎంపీ, ఎమ్మెల్యేను శాలువా, పూలదండలతో సన్మానించి మెమెంటోలతో సత్కరించారు. ముస్లిం మతపెద్దలు కూడా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, పార్టీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, కమిటీ సభ్యులు బుగ్గల జానీ, షేక్ పూలకొట్టు జానీ, అడ్డాలి మాబు సుభానీ, షేక్ సైసావలి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, వైస్ చైర్మన్ కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ మౌలాలీ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, నాయకులు షేక్ డాడీ, మస్తాన్‌వలి, జానీ, కొత్వాల్ సైదా, సుభానీ, సైదా పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ విధానంలో వేసిన ఏ గ్రేట్ మరియు ఏటీఎం మోడల్స్ ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఇండోజర్మన్ గ్లోబల్ ఆగ్రో ఏ క్లాసికల్ రీసెర్చ్ లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్(ఇగ్రాల్), రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్‌ఆనంద్ చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో వేసిన పలు రకాల పంటలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఏ గ్రేడ్ విధానంలో ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు రకాల పంటలను సాగు చేయడం వలన అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అదేవిధంగా ఏటీఎం మోడల్‌లో పలు రకాల పంటల నుంచి ఆదాయం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకపోవటం వలన మొక్కలు తుఫాన్‌లను కూడా తట్టుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయన్నారు. ఏటీఎం విధానంలో దుంపజాతి మొక్కలు, ఆకుకూరలు చుట్టూ తీగ జాతి మొక్కలు బెడ్లకి అంచుల్లో గోరుచిక్కుడు, టమాటా, వంగ లాంటివి వేసుకోవడం వలన నిరంతర ఆదాయం వస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయవిధానంలో ఏటీఎం తరహాలో సాగు చేసుకోవాలన్నారు.

మొసలిని బంధిస్తాం

నకరికల్లు: మొసలిని పట్టుకొని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి తరలిస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పురుషోత్తమరాజు తెలిపారు. సాక్షిలో మొసలి సంచారం అంటూ శుక్రవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు స్పందించారు. తహసీల్దార్ కె.నగేష్ సూచనల మేరకు నకరికల్లులోని రైల్వేట్రాకు వద్ద మొసలి సంచరిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు.